క్లుప్తంగా

కార్పొరేటర్ సుధకు సత్కారం



కొణతాల సుధకు జ్ఞాపిక అందిస్తున్న నూకరెడ్డి, కుటుంబ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ విభాగ ప్రతినిధి కొల్లి నూకరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు చిరు సత్కారం చేశారు. కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వేదిక వద్ద సుధకు నూకరెడ్డి శాలువా కప్పి, వేంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, చట్టి నూకరాజు, స్వప్న, నూకరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం నిర్మించాలని వినతి



ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు, తెలగ, బలిజసేవా సంఘం సభ్యులు తమకు కమ్యూనిటీ భవనం కావాలని వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన భవనం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, అప్పలస్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాలినడకన అప్పన్న సన్నిధికి..



గోపాలపట్నంలో గరిడి సాము, ఎద్దులతో కాలినడకన వెళ్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపలట్నం: ఎమ్మెల్యే గణబాబు కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం వరాహలక్ష్మీ నృసింహ స్వామి సన్నిధికి సాము గరడిలతో కాలినడకన సోమవారరం వెళ్లారు. గోపాలపట్నంలో ఉదయం మేళ తాళాలతో బయలు దేరిన ఆయన మెట్ల మార్గాన వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు, కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, రాపర్తి కన్నా, గల్లా చిన్న, స్థానిక నాయకులు రెడ్డి నారాయణ రావు, సత్తిరాజు ఉన్నారు.

'సీడబ్ల్యూసీలకు ప్రత్యేక నిధులు విడుదల చేయాలి'

అగనంపూడి: ఉక్కు నిర్వాసిత కాలనీల్లోని సీడబ్ల్యూసీలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఉక్కు యాజమాన్యం వాటాగా విడుదల చేసే ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సిటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి కోరారు. ఈ విషయంలో యాజమాన్యం తీరు మార్చుకోవాలన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీ పాత కమిటీ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులు, ఉద్యోగుల మానసిక ఉల్లాసం, పిల్లల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు నాలుగు నిర్వాసిత కాలనీల్లో సీడబ్ల్యూసీలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీని కోసం ప్రతీ నెలా కార్మికుల జీతాల నుంచి మినహాయిస్తున్న నిధులతో పాటు యాజమాన్యం కూడా గతంలో ప్రత్యేక నిధులు విడుదల చేసేదని, అయితే కొంతకాలంగా నిధుల కేటాయింపులకు మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. సీడబ్ల్యూసీ అధ్యక్షుడు జయరాజు, మాజీ కార్యదర్శి వంకర రాము తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు పి.కృష్ణారావు, గుదే సుశీలా గజేంద్రరావు, పెదిరెడ్ల నీలకంఠం, బలిరెడ్డి సత్యనారాయణ, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వావ్..!

● విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న ఎయిర్‌పోర్టు–ఎన్‌ఏడీ రహదారులు



విశాఖ విమానాశ్రయంలో డెలిగేట్స్ వచ్చే రహదారిలో చెట్లకు అలంకరించిన విద్యుత్ దీపాలు



ఎన్‌ఏడీ జంక్షన్ సెంటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన జీ20 వైజాగ్ డిస్‌ప్లే



కాకానినగర్ జంక్షన్ వద్ద డివైడర్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన మ్యాట్‌లు



విమానాశ్రయం జంక్షన్ వద్ద విద్యుత్ కాంతుల్లో సెంటర్ ఐలాండ్

గోపాలపట్నం: జీ–20 సదస్సుకు నగరం ముస్తాబైంది. వివిధ దేశాల ప్రతినిధులు వచ్చే ఎయిర్‌పోర్టు మార్గం కాంతులీనుతోంది. విద్యుత్ వెలుగులతో పాటు పచ్చని మొక్కలు కనువిందు చేస్తున్నాయి. నగరానికి వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతుండడంతో రహదారి మొత్తం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. విమానాశ్రయంలో చెట్లతో పాటు జాతీయ రహదారిలో విద్యుత్ స్తంభాలకు.. ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద సెంటర్ ఐలాండ్స్ కాంతులీనుతున్నాయి. ఎన్‌ఏడీ జంక్షన్ సమీప రైల్వే బ్రిడ్జ్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణం జరుగుతున్న ఈ ప్రాంతంలో గ్రీన్ మ్యాట్‌లు, నలుపు తెలుపు రంగుల వస్త్రాలతో కప్పారు. ఈ ఏర్పాట్లను చూసిన వారు మెచ్చుకుంటున్నారు. ఇప్పటికే గ్రీన్ బెల్టులు, ఫుట్‌పాత్‌లో డివైడర్ల మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

సందడిగా కేంద్రీయ విద్యాలయం–2 స్నాతకోత్సవం



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సింధియా: మల్కాపురంలోని నౌసేనబాగ్ కేంద్రీయ విద్యాలయం–2లో సోమవారం 5వ తరగతి విద్యార్థుల స్నాతకోత్సవం సందడిగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను ముఖ్య అతిథులు రిటైర్డ్ ఉపాధ్యాయులు సాయిబాబు, శ్యామల, జె.శాంతితోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ నిషికాంత్ అగర్వాల్, హెచ్‌ఎం ఎం.వెంకటలక్ష్మి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత నృత్యం, శ్లోకాల పఠనం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ నిషికాంత్, హెచ్‌ఎం వెంకటలక్ష్మిలు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య, మానసిక ఉత్తేజాన్ని అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టీచర్ల కృషికి తల్లిదండ్రుల తోడ్పాటు కూడా ఉంటే పిల్లల ఉన్నత విద్య, ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

774వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు ప్రతీ కార్మికుడు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిరసనలు చేపట్టి సోమవారానికి 774వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్‌ఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్‌లైతే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని, లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

బీజేపీ పాలనలో రాష్ట్రానికి అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార: పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట ప్రతిపాదించిన ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లను కాదని.. నేడు దాన్ని తగ్గించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేలం నేటికి వాయిదా



వేలం పాట నిర్వహణకు సిద్ధమైన జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రోడ్ మార్జిన్ ఆశీలు వసూలుకు ఏర్పాటు చేసిన వేలంపాట వాయిదా పడింది. సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ పి.సింహాచలం ముందుగానే ప్రకటించారు. ఈ వేలంపాటలో పాల్గొనేందుకు కొంతమంది డిపాజిట్ చెల్లించినప్పటికీ, వారు సకాలంలో హాజరు కాలేదు. వచ్చినవారిలో కూడా కొంతమంది తక్కువ ధరకు పాడటానికి రింగ్ అయ్యారనే అనుమానం రావడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్టు జెడ్సీ ప్రకటించారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు తగిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

డిగ్రీలతోపాటు నైపుణ్యాలూ ప్రధానం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అత్యంత పోటీ ప్రపంచం యువతకు ఆహ్వానం పలుకుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి తరం డిగ్రీలతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంత శక్తి విద్యార్థుల సొంతమని, మస్తిష్కంలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో చూపాలన్నారు. వ్యాపారాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి యూనివర్సిటీ సిద్ధంగా ఉందన్నారు. సాంకేతికత మార్పులు యువతకు సవాళ్లు విసురుతోందని, వీటికి పరిష్కారాలు చూపే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే దిశగా కృషి జరగాలని ఆచార్యులకు సూచించారు. ఆచార్యులు ఆత్మావలోకనం చేసుకుంటూ అసాధారణ పనితీరు, ప్రగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ ఇంటిలిజెన్స్ రంగాలు భవిష్యత్ సమాజంపై అత్యంత ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ రంగంలో ఈసీఈ విద్యార్థులు అడుగు పెట్టాలన్నారు. ఏయూ పూర్వ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ స్టార్టప్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమన్నారు. జీవీపీ కళాశాల డీన్ ఆచార్య కె.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అన్ని రంగాలలో ఏయూ అద్భుతమైన ప్రగతిని చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు, విభాగాధిపతి ఆచార్య పి.రాజేష్ కుమార్, అనిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామకృష్ణ, డాక్టర్ అనూరాధ, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ లో ఆదారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కంటి వైద్య పరీక్షలతో పాటు కంటి అద్దాలు పంపిణీ, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తామని కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాలువలు పరిశుభ్రం



పల్లి వీధిలో శుభ్రపరిచిన కాలువ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని వీధి కాలువల్లో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మల్కాపురం పరిధి పల్లి వీధి, గొల్ల వీధి, నగరాల వీధి తదితర ప్రాంతాల్లోని కాలువలను వార్డు హెల్త్ అసిస్టెంట్ రవి తన సిబ్బంది సాయంతో శుభ్రం చేయించారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పందికొక్కులు, వీధి కుక్కలు అక్కడ చేరి వ్యర్థాలను తింటూ పరిసర ప్రాంతాలను పాడుచేస్తున్నాయి. ఆయా ప్రాంతాలవాసులు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో పెట్టుకుని హెల్త్ అసిస్టెంట్ రవి కాలువల శుభ్రత చర్యలు చేపట్టారు. ఆయనకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాట మహోత్సవం



కల్యాణ రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో సీతారాముల కల్యాణ రాట మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 30న శ్రీ రామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. భక్తులు సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



తెరిచి ఉన్న బీరువా, దొంగలు విరగ్గొట్టిన లాకర్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనపై గాజువాక క్రైం పోలీసులు, బాధితుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివేకానంద వీధిలో మొదటి అంతస్తులో నివసిస్తున్న పిళ్లా రమణ, చినతల్లి దంపతులు శుక్రవారం నేపాల్ పర్యటనకు వెళ్లారు. శనివారం వారి ఇంటికి ఓ బంధువు రాగా ఇంటి మెయిన్‌గేట్ తాళంతో పాటు బెడ్ రూమ్ లాక్ విరిగిపోవడం, బీరువాలో లాకర్ తెరిచి ఉండడం కనిపించింది. దీంతో గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఆదివారం ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. బీరువాలో డబ్బు, బంగారం దాచుకునే లాకర్ మాత్రమే తెరిచి ఉందని, ఇంటి యజమాని వస్తే గానీ, ఏమేం వస్తువులు అపహరించారో తెలియదని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



తోట వీధిలో స్థానికులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 56వ వార్డు గొల్లకంచరపాలెం సచివాలయాల పరిధిలోని చెవిటిరాముల వీధి, తోట వీధి ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో కార్పొరేటర్ జాడ కనిపించడం లేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థలో ఉన్నాయని ఆడారి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఇటీవల శంకుస్థాపన చేసిన పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, ఆల్రా కృష్ణ, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు నాయకులు సర్వసిద్ధి సాయిలత, పల్లా ఎర్రికుమార్, దాసరి శామ్యూల్, వై.రాజు, మజ్జి నూకరాజు, రాజ్యం, కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదానికి పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 5న చలో ఢిల్లీ పేరిట సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం 61వ వార్డు మల్కాపురంలోని సిటు కార్యాలయం వద్ద మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి ఆవిష్కరించి, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం చాలా నిరంకుశంగా పాలిస్తోందని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి.. పెత్తందారులకు పట్టువస్త్రాలు పరుస్తున్నారని ఆరోపించారు. వీరికి దేశ భవిష్యత్ కంటే బడాబాబుల దీవెనలే ముఖ్యమని విమర్శించారు. ప్రధాని మోదీ పాలన విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం తలపెట్టమన్నారు. దేశం నలుమూలలా ఉన్న కార్మికులు, నిరుద్యోగులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు, పైడిరాజు, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాసేవా పీఠం సేవలు గొప్పవి



జాకబ్ రాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం కళాసేవా పీఠం సేవలు గొప్పవని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. కుమారి కల్యాణ మండపంలో సోమవారం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో పలువురి ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గణబాబు మాట్లాడుతూ కళలను ప్రోత్సహించడం కళాకారులకు తగిన గుర్తింపునివ్వడం మంచి విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా పెయింటింగ్‌లో పలు అవార్డులు, పురస్కారాలు పొందిన పిట్ట జాకబ్ రాజు మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. కళాసేవా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ కళాపీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు, జాకబ్ రాజు సాధించిన విజయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, కంపర అప్పారావు, కంపర కనకరాజు, పి ఆదినారాయణ, గంపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రామనాయుడు కాలనీలో కోతుల బెడద



రామనాయుడు కాలనీలోని ఓ ఇంటి మెట్లపై వానరం

మర్రిపాలెం: జీవీఎంసీ 57వ వార్డు మహారాణి వీధి రామనాయుడు కాలనీలో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాటి బెడదతో నివాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. స్కూల్‌కు వెళ్లే పిల్లల మీద దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి వంట సామగ్రిని నాశనం చేస్తున్నాయి. డాబా మీదకు వచ్చి ఆరవేసి ఉన్న దుస్తులను చింపేస్తున్నాయి. ఇటీవల ఒకరిపై దాడి చేసి గాయపరిచాయి. డస్ట్‌బిన్లను చెల్లాచెదారు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వరరావు, రామనాయుడు కాలనీ

కంచరపాలెం రైతుబజార్‌లో దొంగతనాలు



రైతుబజార్‌లో పనిచేయని సీసీ కెమెరా

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ సమస్యపై ఎస్టేట్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి రైతుబజార్‌లో సీసీ కెమెరాలను పరిశీలించి పనిచేసేలా చర్యలు చేపట్టాలి.

– జి.చిన్నారావు, కంచరపాలెం

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు..



టెన్త్ విద్యార్థులతో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, పూర్వ విద్యార్థులు

అల్లిపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రమ శిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అందుకుంటారని డిప్యూటీ డీఈవో ఎ.గౌరీశంకర్ అన్నారు. అల్లిపురం వైర్లెస్ కాలనీలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అర్ధ శతాబ్దం కిందట చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన, ఆరోగ్యం, తగిన నిద్ర, పౌష్టికాహారం, ఏకాగ్రతతో కూడిన విద్యాభ్యాసం వల్ల వార్షిక పరీక్షల్లోనే కాక జీవితంలో ఎదురయ్యే ప్రతి పరీక్షలో ఉత్తీర్ణులవుతారన్నారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల నిమిత్తం దిశానిర్దేశం చేశారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలతో ఉన్న అనుబంధం, వాళ్ల ప్రోత్సాహక కార్యక్రమాలను అభినందించారు. అనంతరం పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా అందజేశారు. డైట్ కళాశాల (భీమిలీ) రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ డబ్బీరు రమామణి మాట్లాడుతూ తన తల్లి డబ్బీరు సుగుణ జ్ఞాపకార్థం ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు బాలికలకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనం అందజేయనున్నట్లు ప్రకటించారు. బాలురకు కూడా మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.లక్ష్మణరావు, పూర్వ విద్యార్థులు దత్తి ప్రసాదరావు, బూరె రమేష్, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఆర్. ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.